శంకుస్థాపనకే పరిమితమా?

- 18నెలలుగా ప్రారంభంకాని బీటీ పనులు
- రోడ్డు నిర్మాణంతో జనగాం–వాచ్యాతండా మధ్య తగ్గనున్న దూరభారం
- పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తుల వేడుకోలు


రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం


కంపచెట్లతో మూసుకుపోయిన వాచ్యాతండా వెళ్లే రోడ్డు

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని జనగాం నుంచి వాచ్యాతండా గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితమైంది. ప్రజాప్రతినిధులు హడావుడిగా శంకుస్థాపనలు చేసినా కాంట్రాక్టర్లు మాత్రం ఇప్పటికీ పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు. జనగాం నుంచి వాచ్యాతండా వరకు 4కిలోమీటర్లు దూరంకు గాను ఎస్‌డీఏఫ్ నిధులు రూ.2.85కోట్లు అంచనా వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బీటీరోడ్డు నిర్మాణానికి 18నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గుంతలమయంగా మారినరోడ్డుతో ప్రయాణాలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

తగ్గనున్న దూరభారం..

జనగాం నుంచి వాచ్యాతండాకు 4కిలోమీటర్లు దూరం ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డులో పెద్దగుంతలతో, కంకర తేలి ఉంది. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు అలుకుపోయి ఉండడంతో ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈరోడ్డు వెంట సైడ్‌బర్మ్ అనవాళ్లు కూడా లేకుండా పక్కన ఉన్న రైతులు రోడ్డును ఆక్రమిస్తూ వస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం చేయడం ఇబ్బందిగా ఉండడంతో పలువురు ప్రయాణికులు రోడ్డుపై రాకపోకలు సాగించడమే మానేశారు. వాచ్యాతండాకు చెందిన ప్రజలు జనగాం గ్రామానికి రావాలంటే గంగమూలతండా మీదుగా చుట్టూ తిరిగి జనగాం చేరుకుంటున్నారు. గంగమూల తండా మీదుగా వస్తే అదనంగా 2కిలోమీటర్లు దూరభారం పెరుగుతుంది. వాచ్యాతండా– జనగాం రోడ్డు నిర్మాణం పూర్తి అయితే వావిళ్లపల్లి, అరెగూడెం గ్రామాలకు వెళ్లడానికి కూడా మరో కిలోమీటరు దూరం తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలి

జనగాం నుంచి వాచ్యాతండా వరకు బీటీరోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి. ఈ రోడ్డు గుంతలయమంగా మారడంతో వాచ్యాతండా నుంచి గంగమూలతండా మీదుగా జనగాం, అరెగూడెం, వావిళ్లపల్లి గ్రామాలకు వెళ్తున్నాం. ఇలా వెళ్లడంతో దూరభారం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు నిర్మాణం చేస్తే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయి.
– వాంకుడోతు శంకర్‌లాల్, వాచ్యాతండా

ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి


సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

చౌటుప్పల్ : పన్నులు చెల్లించే విషయంలో ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంటిపన్నులు, ఎల్ఆర్ఎస్‌పై మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా వసూలు కావాల్సిన కలెక్షన్, ఇప్పటి వరకు అయిన కలెక్షన్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెలాఖరునాటికి లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటిపన్నులు, ఎల్ఆర్ఎస్ గడువులోగా చెల్లిస్తే కలిగే ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో మున్సి పల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, అధికారులు రఘుపతి, హనుమాన్‌ప్రసాద్, రేణుకుమార్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు ఎంపిక

చౌటుప్పల్ : అక్షర కళాభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, అధ్యక్షుడు మోటె సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బడుగు శ్రీరాములు తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంస్థ 31వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీవిశ్వావసు ఉగాది పర్వదినాన్ని పురస్కరించకొని అందజేసే పురస్కారాలకు రాష్ట్రస్థాయిలో పలువురు ఎంపికయ్యారని తెలిపారు. ఉగాది అక్షర పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన ఆర్క్ గ్రూప్ సీఎండీ గుమ్మి రాంరెడ్డి, అక్షర సాహితీ పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన దాసోజు పద్మావతి, శ్రీక్రోధినామ సంవత్సర అక్షర సేవా పురస్కారానికి దేవరకొండ పట్టణానికి చెందిన వనం చంద్రమౌళి, అక్షర సాహితీ పురస్కారానికి భువనగిరికి చెందిన దండమూడి చరణ్, యక్షగాన కళా ఆత్మీయ సేవా పురస్కారానికి చౌటుప్పల్‌కు చెందిన యాట వెంకటేశం, సిద్దాంతి పురస్కారానికి రాళ్ల శివరామాచార్యులు, ఆధ్యాత్మిక సేవా పురస్కారానికి నారాయణపురం గ్రామానికి చెందిన సాదు వెంకన్న ఎంపికైనట్లు తెలిపారు. ఈ పురస్కారాలను శ్రీవిశ్వావసు ఉగాది రోజున అందజేస్తామన్నారు.

క్లుప్తంగా

ఏడీ శ్రీనివాస్‌కు సన్మానం


జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని పోచంపల్లి చేనేత సహకార సంఘం, టైఅండ్‌డై అసోషియేషన్ భవనాన్ని చేనేత, జౌళిశాఖ నూతన జిల్లా ఏడీగా నియమితులైన శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవ కుమార్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, ఎన్నం శివకుమార్, భోగ సత్యనారాయణ, కస్తూరి సుదర్శన్, గుండు శ్రీరాములు, సీత దామోదర్, రాపోలు శ్రీనివాస్, ముస్కూరి నర్సింహ, మంగళపల్లి రమేశ్, ఈపూరి ముత్యాలు ఉన్నారు.

కాటేపల్లి వాసికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న జలంధర్‌గౌడ్

మోటకొండూర్ : మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల జలంధర్‌గౌడ్‌కు తెలుగు డిపార్ట్‌మెంట్ వారు శుక్రవారం డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ పర్యవేక్షణలో జూకంటి జగన్నాథ్నం సాహిత్యం అనే అంశంపై పరిశీలన చేసినందుకు ఆయనకు డాక్టరేట్ అందించారు. డాక్టర్ అందించిన వారిలో ఉస్మానియ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం, ఎ విజయలక్ష్మి, రఘు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న పశ్చిమట్ల శివరాజ్‌గౌడ్

భువనగిరి : మండలంలోని బండసోమారం గ్రామానికి చెందిన సుర్వి రాములమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. రాములమ్మ మృతదేహంపై కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పశ్చిమట్ల శివరాజ్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు గుండాల సత్యనారాయణ, బొక్క సురేందర్‌రెడ్డి, ఎలిమినేటి సురేష్‌రెడ్డి, పచ్చిమట్ల నరేందర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో విఫలం


సభ్యత్వ నమోదులో పాల్గొన్న రైతులు

రామన్నపేట : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సిరిపురం గ్రామంలో చేపట్టిన రైతుసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బల్గూరి అంజయ్య, అంబటి మల్లారెడ్డి, బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్, బల్గూరి ఉపేందర్, దోమలపల్లి నర్సింహ, సత్తయ్య, మల్లారెడ్డి, రుక్మారెడ్డి, సుభాష్‌రెడ్డి, మల్లేశం, నర్సింహ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాస కవిత, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, నాయకులు కోరె వెంకన్న, సుంచు నాగరాజు, ఎలిమినేటి ఎలందర్, గర్దాసు లింగయ్య పాల్గొన్నారు.

శ్రీతిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల శ్రీతిరుమలనాథ స్వామి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను గ్రామం నుంచి భాజభజంత్రీలతో భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే బీఆర్ఎస్‌కేవీ ధ్యేయం

- డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమమే బీఆర్ఎస్‌కేవీ ధ్యేయమని డీసీసీబీ మాజీ చైర్మన్, పీఈఎల్ బీఆర్ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలోని పీఈఎల్ పరిశ్రమలో జరిగిన యూనియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. కార్మికులు మెచ్చే విధంగా మూడవ అగ్రిమెంట్, వేతన ఒప్పందం ఉంటుందన్నారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులు సంతోషపడేలా, అగ్రిమెంట్ ఒప్పందం చేయిస్తామన్నారు. యాజమాన్యాన్ని ఒప్పించి మంచి బెనిఫిట్స్ అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బరిగె నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచంద్రారెడ్డి, పాపయ్య, ఉపాధ్యక్షులు గట్టికొప్పుల లక్ష్మీనర్సయ్య, కోశాధికారి గవ్వల రమేష్, శ్రీశైలం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, లక్ష్మీనారాయణ, గుండ్లపల్లి వెంకటేష్, సీస రమేష్ పాల్గొన్నారు.

‘వన్ నేషన్ వన్ ఎలక్షన్’తో దేశానికి మేలు

- బీజేపీ జిల్లా కార్యదర్శి వైజయంతి


యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి వైజయంతి

యాదగిరిగుట్ట : వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో దేశానికి ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి వైజయంతి అన్నారు. శుక్రవారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ఒకే సారి అన్ని ఎన్నికలు జరగడంతో దేశంలో ఎన్నికల వ్యయం భారీగా తగ్గుతుందన్నారు. దీంతో పాటు స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడతాయన్నారు. ప్రాంతీయ పార్టీల బ్లాక్‌మెయిలింగ్ సైతం ఉండదని అన్నారు. సమావేశంలో పట్టణ కోకన్వీనర్ పలుగుల సురేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బందారపు మల్లేష్, పట్టణ కార్యదర్శిలు దొమ్మట ప్రభాకర్, నల్ల వాసుదేవరెడి, సీనియర్ నాయకులు నల్ల వెంకట్‌రెడ్డి, రంగా సత్యం, బెలిదే అశోక్, తాళ్ల భాస్కర్‌రెడ్డి, జవహర్, ఎల్.శ్రీనివాస్, బొమ్మగాని రాజమణి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బుచ్చిబాబు, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బూడిద నవీన్, కిసాన్ మోర్చ అధ్యక్షుడు సుడుగు రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకే ఎన్నిక విధానంతో దేశం అభివృద్ధి

రాజాపేట : ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా నాయకుడు పాశం భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో దేశం ఆర్థిక పురోగతిని సాధిస్తుందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల రమేష్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల కన్వీనర్ చాపురం శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల నరసింగరావు, నాయకులు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి గారు, బీజేపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీనునాయక్ పాల్గొన్నారు.

ఎర్రజెండాతోనే ప్రజల సమస్యలు పరిష్కారం

భువనగిరి : ఎర్రజెండాతోనే ప్రజల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్యం–ప్రజా చైతన్యయాత్ర శుక్రవారం మండలంలోని అనాజీపురం గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాదం పెరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గునుగుంట్ల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, నాయకులు మాటూరి బాలరాజు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, పాండు, నర్సింహ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలి

భువనగిరిటౌన్ : జిల్లాలో వందల ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు ప్రభుత్వం చేతగానితనం వల్లే ఆక్రమణ గురవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ భూములను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదని, కొంతమంది కబ్జాదారులు, రాజకీయ నాయకుల చేతుల్లో వక్ఫ్ భూములు ఉన్నాయని దీనిని జిల్లా యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. ఈ విషయంపై సోమవారం వామపక్ష పార్టీల అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం


భూదాన్‌పోచంపల్లి : పరీక్ష రాసేందుకు వెళ్తూ విజయసంకేతం చూపిస్తున్న విద్యార్థులు


చౌటుప్పల్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద తమ హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

చౌటుప్పల్ : పట్టణంలో పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మొత్తం 1155మంది విద్యార్థులకు ఆయా పరీక్షా కేంద్రాలకు కేటాయించారు. అందులో చౌటుప్పల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. పరీక్షలకు వెళ్లే ముందు పలువురు విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

యాదగిరిగుట్ట : పట్టణంలో పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్‌రెడ్డి సందర్శించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని ఫిట్స్ వచ్చి కింద పడిపోయింది. వెంటనే గమనించిన స్నేహితులు ఆమెకు మంచి తాగునీరు అందించి అనంతరం పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. కాగా జెడ్పీ బాలికల పాఠశాలను స్క్వాడ్ గోపాల్‌రెడ్డి సందర్శించారు. మూడు పరీక్షా కేంద్రాలలో మొత్తం 526 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారని తెలిపారు.

రామన్నపేట : మండల కేంద్రంలో శుక్రవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు వందశాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి జి.జ్యోతి తెలిపారు. అనంతరం కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు.

వలిగొండ : మండలంలో పదోతరగతి పరీక్షలకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3కేంద్రాలలో 545 మంది విద్యార్థులకు గాను 544 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి భాస్కర్ శుక్రవారం తెలిపారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ కేంద్రంలో 196మంది విద్యార్థులకు 196మంది హాజరయ్యారు. కేంద్రాలను స్క్వాడ్ ఏడీ ప్రశాంత్, స్క్వాడ్ సభ్యుడు రంగరాజన్, తహసీల్దార్ వి.లావణ్య ఆకస్మిక తనిఖీ చేశారు.

భువనగిరి : పట్టణంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మొత్తం 8పరీక్ష కేంద్రాలలో 1361 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 1360 మంది హాజరైనట్లు ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి తెలిపారు.

గుండాల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షకు 250కి 249 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పద్మ తెలిపారు.

రాజాపేట : మండలంలోని రఘునాథపురం, రాజాపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు సెంటర్లలో 429మంది విద్యార్థులకు గాను ఇద్దరు బాలికలు గైర్హాజరైనట్లు ఎంఈఓ రమేష్ తెలిపారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు 100శాతం హాజరయ్యారు. మండలంలోని మొత్తం 205మంది పరీక్షలు రాశారు.

మోత్కూరు : మండలంలో పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 467మంది విద్యార్థులు ఉండగా మొత్తం విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు నర్సిరెడ్డి, సత్యనారాయణ, రమేష్ మొదటి రోజు పరీక్ష విద్యార్థులు ప్రశాంతంగా రాశారని తెలిపారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలో పదోతరగతి పరీక్షలకు 3పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో శుక్రవారం మొత్తం 403విద్యార్థులకు గాను 403మంది పరీక్షకు హాజరయ్యారు.

ఆలేరురూరల్ : పట్టణంలో పదోతరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని ఆలేరు ఎంఈఓ ఎర్ర లక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు తెలుగు పరీక్షలకు 585 మంది విద్యార్థులకు 584మంది హాజరైనట్లు తెలిపారు. అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయన్నారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 169మందికి గాను 169మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ సబిత తెలిపారు.

బొమ్మలరామారం : మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో, మోడల్ స్కూల్ సెంటర్లలో శుక్రవారం జరిగిన పదోతరగతి పరీక్షల్లో మొత్తం 437మంది విద్యార్థులకు ఇద్దరు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు తెలుగు పరీక్ష మినహాయింపుకు గాను ఒక విద్యార్థి పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఈఓ రోజారాణి తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం


ఆలేరురూరల్ : మాట్లాడుతున్న కల్లూరు మల్లేశం

ఆలేరురూరల్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరు మల్లేశం అన్నారు. శుక్రవారం మండలంలోని శర్బనాపురం గ్రామంలో స్థానిక ఎన్నికలు–ఓటరు చైతన్యపై ప్రజానాట్య మండలి జిల్లా ఆధ్వర్యంలో కళారూపాలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. స్వార్థపూరితంగా ఓటు వేసే ప్రజలను పాలకులు చిన్న చూపుచూస్తు తమ బానిసలుగా భావిస్తూ డబ్బు, మద్యం, తాయిలాలిస్తే ఓటు వేస్తారని భావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, సుదగాని సత్యరాజయ్య, ఎర్రయ్య, రాజు, శివ, లావుడియా రాజు, ముత్తిరెడ్డి, యాదగిరి, శ్రీను, బాబు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామంలో నేడు జరిగే ప్రజాచైతన్య కళాయాత్రను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు కురుమేటి యాదయ్య కోరారు. శుక్రవారం పాటిమట్లలో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు రాచకొండ కనకయ్య, దొండ నాగరాజు, మెతుకు సాయిలు, కురుమేటి సోమయ్య, నారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

ఆత్మకూరు(ఎం) : మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వి.లావణ్యను మండల రేషన్‌డీలర్లు శుక్రవారం స్థానికంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లావణ్య మాట్లాడారు. అనంతరం రేషన్‌డీలర్‌ల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో డీటీ ఎండీ షఫీయోద్దీన్, ఆర్ఐ వై.మల్లిఖార్జునరావు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పల్లెర్లలో సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ తండ నర్సింహ, మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి, గ్రామస్తులు సోలిపురం నరసింహారెడ్డి, వెంకన్న, వెంకటేష్, ఎల్లయ్య, ఐలయ్య, మల్లేష్, రాజు ఉన్నారు.

ఆస్తిపన్నుపై ఫేక్‌కాల్స్‌ను నమ్మొద్దు

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఆస్తిపన్ను వసూళ్ల విషయమై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఫేక్ కాల్స్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని, ఫేక్‌కాల్స్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామాలింగం శుక్రవారం తెలిపారు. ప్రజలు వాటిని నమ్మకుండా బిల్‌కలెక్టర్లు, సిబ్బందికి ఇవ్వాలని లేదా మీసేవా కేంద్రాలో, ఆన్‌లైన్‌లో ఆస్తి పన్నును చెల్లించాలని సూచించారు.

వృద్ధులకు చేతికర్రలు పంపిణీ

ఆలేరురూరల్ : మండలంలోని కొల్లూరు గ్రామంలో అరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు చేతికర్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా త్వరలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్, రైతు సంఘం నాయకులు రాజయ్య, ఆంజనేయులు అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

తహసీల్దార్ సస్పెన్షన్‌పై హర్షం

బీబీనగర్ : విధుల పట్ల ఆలసత్వాన్ని ప్రదర్శించిన బీబీనగర్ తహసీల్దార్ శ్రీధర్‌ను కలెక్టర్ హనుమాంతురావు సస్పెండ్ చేయడం హర్షణీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై దృష్టి సారించి కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

భూదాన్‌పోచంపల్లి : విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పీడీఎస్‌యూ యువజన సంఘం జిల్లా కోశాధికారి పగుడాల శివ, పోతగల్ల నరసింహను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. పోలీసుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. విద్యారంగానికి కనీసం 20శాతం నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

ఇఫ్తార్ విందు

ఆలేరురూరల్ : రంజాన్ పవిత్రమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో శుక్రవారం ముస్లింలకు కాంగ్రెస్ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంజాన్ మాసం అత్యంత పవిత్రమైందని సమాజంలో ప్రతిఒక్కరిని అల్లా సుఖ సంతోషాలతో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఎ.ఎజాజ్, కట్టెగొమ్ముల విద్యాసాగర్, జైనుద్దీన్, వెంకటేశ్వరరాజు, దశరథ, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిజాంభవ యువజన సంఘం కమిటీ ఎన్నిక

రామన్నపేట : మండలంలోని వెల్లంకిలో ఆదిజాంభవ యువజన సంఘం గ్రామ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సండ్ల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా తలారి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి రవి, కోశాధికారిగా కుర్మ వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా చెన్ని స్వామి, జినుక లింగయ్య, కమిటీ సభ్యులుగా నకిరేకంటి మహేష్, జినుక సాయిలు, చేగూరి ముత్యాలు, గూని రాజు, నర్సింహ, గణేష్, కిషన్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చౌటుప్పల్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రకాష్, తీగుళ్ల శ్రీనివాస్, దోనూరు శ్రావణ్‌రెడ్డి, అజయ్, సాగర్, మల్లేష్, సాయి, చందు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : పట్టణానికి చెందిన గుంటి ఉపేందర్ తండ్రి గుంటి నర్సయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో మోత్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 2005–06 విద్యా సంవత్సరానికి చెందిన పదోతరగతి బ్యాచ్ స్నేహితులు అతడికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు కూరెళ్ల రాజశేఖర్, ఎడ్ల యాకు, సోమేష్, చంద్రశేఖర్, అనిల్, మహేష్, నరేష్, మహేష్ ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని తూర్పుగూడెం గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో సీపీఎం జిల్లా, మండల నాయకులు శుక్రవారం ఆయనను పరామర్శించి పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బూర్గు కృష్ణారెడ్డి, సైదులు, నాయకులు కొండే శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


దోపోత్సవంలో పాల్గొన్న భక్తులు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం దోపోత్సవం కార్యక్రమంతో ముగిశాయి. కల్యాణోత్సవం, అగ్నిగుండాల ఘట్టాలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ వి.హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోపోత్సవం కార్యక్రమంలో దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు పట్టుకునే విధంగా కార్యక్రమాన్ని కన్నులకు కట్టిన విధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రుగౌడ్, కమిటీ సభ్యులు బయ్యని రాజు, అరవింద రాయుడు, బుర్ర యాదయ్య, మర్రి ఆనందం, బొల్లేపల్లి సీతయ్య, గుండు శ్రీను, అన్నెపు నర్సింహ, పట్వారి అంజయ్య, బుర్ర కృష్ణ, నరేందర్, కొమురయ్య, శేఖరాచారి, సోమేష్‌చారి, పూజారులు పారునంది లక్ష్మణమూర్తి, మోత్కూరు రామలింగంశర్మ, పారునంది హరిబాబుశర్మ, నాగరాజు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరుపెట్టాలి

ఆలేరురూరల్ : జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరుపెట్టాలని సర్దార్ సర్వాయి పాపన్న యువసేన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలి బహుజనుల పోరాటయోధుడు కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన బహుజనుల పోరాట యోధుడన్నారు. సమావేశంలో పుట్ట మల్లేశం, ఆరే ప్రశాంత్, పల్లె నర్సింహులు, మొరిగాడి చంద్రశేఖర్, మహేష్, కృష్ణరాజు, సత్తయ్య, మహేష్, మల్లేశం పాల్గొన్నారు.

నేడు మాతం ప్రదర్శన

భువనగిరిటౌన్ : ప్రవక్త మహమ్మద్ అల్లుడు హజ్రత్ మౌలా అలి వర్ధంతిని భువనగిరి షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో శనివారం (22న) మాతం ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు షియా ముస్లిం సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్ శుక్రవారం తెలిపారు. ఖాజీ మహిల్లాలోని బీబీ కా అలవా పీర్ల కొట్టం నుంచి జంప్ ఖానాగూడెం అలావా మీదుగా షియా మసీదు వరకు మాతం ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఇందులో నోహా, మర్సియా విషాద గీతాలు ఆలపిస్తారు. యువకులు కత్తులతో ఎదపై బాదుకుటూ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.